మనసు నిర్మలంబు మంచికి మార్గంబు
మనసు నిర్మలంబు మహిత శక్తి
నిర్మలంపు మనసె నీరధి ముత్యమా
మరచి పోకు ఒట్టి మంచి మాట
చెడ్డ చూడరాదు చెప్పరాదెప్పుడు
వినగరాదెప్పుడును విశ్వమందు
మూడు కోతులు గల మూర్తిని తలచుచు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

విద్యార్థులారా!

ఉపనిషత్తు వాక్యానుసారము శరీరము రథమనియు, ఇంద్రియములు గుఱ్ఱములనియు, మనసు పగ్గమనియు మనము గుర్తించుకున్నాము. శరీర, ఇంద్రియ, మనస్సుల యొక్క తత్వము కేవలము నిరుపయోగమైనవి. గుఱ్ఱము ఎంత పెద్దదైనప్పటికిని, పగ్గమెంత బలమైనవైనప్పటికిని, రథము చాలా అందచందములతో కూడినప్పటికిని సారథియే లేకుండిన ఈ రథము, ఈ గుఱ్ఱములు, ఈ పగ్గములు నిరుపయోగములే. కనుక జీవిత యాత్రలో బుద్ధి అత్యంత ప్రధానమైనది. నిశ్చయాత్మిక బుద్ధిః అన్నారు. ఇది నిశ్చయాత్మకమైనేటు వంటిది. జీవితములో అనేక సమస్యలు, అనేకరకములైన చికాకులు, అలజడులు చెలరేగుతూ వుంటాయి. అయితే ఈ సమస్యలను పరిహారము గావించుకోటము ప్రతి మానవునికి తక్షణ కర్తవ్యము. అదే ఈ పరిహారమునకు ఇది ప్రధానమైన సూత్రము. బుద్ధియే. బుద్ధి యొక్క ప్రవేశము లేక మన యొక్క సమస్యలను గాని, మన యొక్క చికాకులు గాని తీరుటకు వీలు కాదు. సంశయమును నిర్మూలము గావించేది బుద్ధి కనుకనే బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్' అన్నారు. ఇంద్రియములకు అతీతమైనది కనుక ఇది సంశయాత్మకమైన స్వరూపము.

భగవద్గీత తన యొక్క ప్రవాహమునకు రెండు హద్దులు ఏర్పరచుకొన్నది.

ఈ హద్దులే లేకుండిన యీ జీవిత ప్రవాహమనేది కేవలము అనేక విధములైన చికులకు బాధలకు, అపాయములకు గురౌతుంది. ఒకవైపున అష్టాక్షరీ మంత్రము, మరొకవైపున అష్టాక్షరీ మంత్రము యీ రెండు మంత్రములనే గట్టుల నడుమ యీ జీవితమనే ప్రవాహము ప్రవహించిన సుఖశాంతులనే అనుగ్రహ సాగరము చేరగలవు. దీని యొక్క అంతరార్థము. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' ఇది ఎనిమిదక్షరముల మంత్రము. మరొకవైపున 'సంశయాత్మా వినశ్యతే' ఇది అష్టాక్షరీ మంత్రము. ఒకవైపున శ్రద్ధ, మరొకవైపున నిస్సంశయము వుండినప్పుడే మానవుని జీవితము గమ్యము చేరగలదు. కనుక మానవునకు శ్రద్ధ నిస్సంశయము అత్యవసరమనేది గీత నిర్ణయిస్తూ వచ్చింది.

ఈ బుద్ధికి మరి అనేక పేర్లు వుంటున్నాయి. దీనికి అంతర్వాణి అని మరొక పేరు. ఈ అంతర్వాణిని పురస్కరించుకొనియే మానవుడు కొంతవరకు తమ జీవిత మార్గమును అనుసరిస్తూ వుంటాడు. సమస్యలు చెలరేగినప్పుడు అంతర్వాణి యొక్క జవాబులకు కాచుకొని వుంటాడు. తన అంతర్వాణియు సంతృప్తిగా లేకుండిన తాను సంతృప్తిని యేమాత్రమును ప్రకటించలేడు. ఇది, అంతర్వాణియు సంతృప్తిగా వుండిన బాహ్య జగత్తునందు సంతృప్తిని ప్రకటిస్తాడు. అదే మన నిత్య జీవితములో వుపయోగపెడుతుంటాము నా conscience నాకు తృప్తిగా లేదు. నా conscience దీనిని ఒప్పుకోటంలేదు. అంటారు. ఇదియే అంతర్వాణి. కనుక మొట్టమొదట follow the master అన్నారు. ఆ master ఎవరు? ఇదే అంతర్వాణి. ఆ conscience ఆ master. అంతర్వాణిని మనము అనుసరించినప్పుడు సరియైన స్థాయిని మనము చేరుకోగలము. ఐతే యీ బుద్ధికి మరొక పేరు కూడను వుంటుండాది. దీనికే జ్ఞానము అని కూడను చెప్పబడినది. ఈ విజ్ఞానమనేది బాహ్యసంబంధమైన విషయములను మాత్రమే విమర్శించి, విచారణసల్పి నిర్ణయాలు చేస్తుంది. ఐతే ఇది అంతర్ సమస్యలను కూడ తర్కించి తద్వారా ఒక నిర్ణయానికి తీసుకువస్తుంది. కనుక దీనికి 'విజ్ఞానము' అని చెప్పటము సరియైన పేరు కాదు. ఈ విజ్ఞానమనేది లౌకిక జగత్తుకు సంబంధించినది. ఇది అంతర్‌సంబంధమైన, సూక్ష్మ స్వరూపమైన తత్వానికి సంబంధించినది. కనుక యీ బుద్ధి యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించుటకు ప్రయత్నించటము అత్యవసరము. ఐతే యీ బుద్ధిని కూడను మధ్య మధ్య అహంకారము ఆవరిస్తూ వుంటుంది. శరీరముకంటె యింద్రియములు సూక్ష్మమైనట్టివిగను, యీ యింద్రియములకంటె మనస్సు మరింత సూక్ష్మమైనదిగను, ఈ మనస్సుకంటె బుద్ధి అత్యంత

సూక్ష్మమైనదిగను, యీ బుద్ధికంటె ఆత్మ మరింత సూక్ష్మమైనదిగను నిర్ణయించవచ్చు. వితే యిట్టి సూక్ష్మమైన బుద్ధికి అహంకారము ఆవరించిందంటే అహంకారము బుద్ధి కంటె సూక్ష్మమైనదిగా నిరూపించాలి. ఈ అహంకారము అత్యంత సూక్ష్మమైనది. సర్వత్రా ప్రవేశిస్తుంది. సర్వకర్మలయందు కూడను ప్రవేశిస్తుంది. కనుకనే మానవుడు యీ అహంకారమును దాటి ఆత్మను చేరలేక పోతున్నాడు. ఒకానొక రాజు ఒక పెద్ద సమావేశమును గావించి అందులో గొప్ప గొప్ప శాస్త్రజ్ఞులను, పండితులను ఆహ్వానించాడు. ఈ సమావేశములో యీ మహారాజు ఒక ప్రశ్నను వేశాడు. ఇంత వేదశాస్త్ర యితిహాస పురాణముల యొక్క ప్రమాణములను ప్రత్యక్షరూపకముగా గోచరింపచేసి, అనుభవించి, ఆనందించి జగత్తుకు అందించిన ఓ గొప్ప శాస్త్రజ్ఞులారా! ఈ సమావేశములో కూడిన యీ మహా అదృష్టవంతులలో ఎవరు మోక్షమును చేరగలరని ప్రశ్నించాడు. అయితే యీ పండితులు అనేక పాండిత్యము కలిగిన వారైనప్పటికిని దీనికి ధైర్యంగా సాహసంగా జవాబులు చెప్పటానికి సాహసించలేదు. ఆ సమావేశములో సభ అంతా కూడను స్తంభించి పోయింది. నిశ్శబ్దముగా వున్న ఆ సభలో ఒక సామాన్యమైన వ్యక్తి లేచి మహారాజా! నేను పోతే పోవచ్చు అన్నాడు. పండితులందరికి మహా అసూయ కలిగింది. ఏ శాస్త్రములు, యే యితిహాసము యే పురాణము, యే భగవద్గీత, యే బ్రహ్మసూత్రము యేమీ తెలియని సామాన్యమానవుడు ఎట్టి సాధనా సంపత్తి యెరుగని పామరుడు నేను పోతే పోవచ్చునని ధైర్యముగా చెప్పుచున్నాడే యితనికి యెక్కడనుంచి వచ్చింది యీ ధైర్యము, దేనిని చూసి చెబుతున్నాడు దీని అంతరార్థమేమిటి అని వారిలో వారు కొంత గుసగుసలు ప్రారంభమైనాయి. మహారాజు ఆ వ్యక్తిని చెంత జేర్చి నాయనా! ఏ ఆధారమును పురస్కరించుకొని నీవు నేను పోతే పోవచ్చు అని పలికావు. ఇంతమంది పండితుల లోపల నీవు అందరిని అవమాన పరిచినట్లు కాదా! అన్నాడు. "మహారాజా! క్షమించండి. నేను పోతే పోవచ్చును అనే దానికి అంతరార్థము అహం పోతే పోవచ్చును అని దీని భావము. అహం. నేను అనేటువంటిది. ఈ అహం ఆకారముతో కూడటం చేత యిది అహంకారముగా మారిపోయింది. కనుకనే దేహాత్మ భావము పోయినప్పుడే మోక్షమునకు అర్హుడౌతాడు అని దీని అంతరార్థము. కనుక ప్రతి మానవుని యందును యీ దేహాత్మ భావము, దేహ తాదాత్మ్యమును పొందినప్పుడే యిది అహంకారముగా రూపొందుతుంది. కనుక యీ అహంకారము వుండినంత వరకు బుద్ధి ప్రకాశించదు. కనుక మొట్టమొదట బుద్ధిని ఆవరించిన అహంకారమును నిర్మూలిం

చటానికి తగిన కృషి చేయాలి.

బుద్ధి ఆత్మకు సమీపముగా వుంటుండాది. ఆత్మకు సమీపమునందుండుట చేత ఆత్మయొక్క ప్రభావము, ఆత్మయొక్క ప్రకాశము, ఆత్మయొక్క సత్ఫలత యీ బుద్ధిని సరిగా చేయటానికి అవకాశము వుండాది. కనుక ఆత్మ శక్తి అంతయు యించుమించు 90 శాతము బుద్ధి మీదకు రావటానికి అవకాశము వుంటుండాది. ఈ బుద్ధి తరువాతనే దేహము మనస్సుపైన ప్రసరిస్తుంది. ఈ మనస్సుయొక్క ప్రభావమే యింద్రియములపైన ప్రసరిస్తుంది. ఇంద్రియముల యొక్క ప్రభావమే దేహముపైన ప్రసరిస్తుంది. బుద్ధి శుద్ధమైన అద్దము వంటిది అనుకున్నాము మనము. సూర్యుని యొక్క కిరణములు మన యింటిలో ప్రవేశించటము చాలా కష్టము. అత్యంత చీకటిలో వున్న గృహములో సూర్యుని కిరణములు ప్రవేశించాలని అనుకుంటే అద్దమును సూర్యుని వైపు త్రిప్పి దానిని యింటివైపు కొంత మరల్చినప్పుడు ఆ సూర్యుని ప్రతిబింబము అద్దముపైన పడి, అద్దము యొక్క ప్రతిబింబము ఆ గృహములో ప్రవేశిస్తుంది. ఈ సూర్యకిరణములు దానికిగా గృహములో పడటానికి వీలు లేదు. అద్దము ద్వారానే యీ గృహములో ప్రవేశించాలి. కనుక అద్దముపైన పడిన సూర్యకిరణములు క్రమక్రమేణా తమ యొక్క శక్తిని తగ్గించుకొని తదుపరి గృహములో ఆ reflectionగా చూపిస్తుంది. దీనికి మరొక చిన్న ఉదాహరణము. నీరు పుట్టిన చోటు పవిత్రముగానే వుంటుంటాది. కానీ క్రమక్రమేణా ప్రవహించి జనల యొక్క వుపయోగస్థాయికి వచ్చేటప్పటికి మాలిన్యాన్ని పొందుతాయి. అదేరీతిగనే ఆత్మ యొక్క ప్రభావము సూర్యుని పైన బడి అనగా బుద్ధిపైన బడి మనస్సుపైన పడి, మనస్సునుంచి యింద్రియములపై బడి, ఇంద్రియముల ద్వారా శరీరము దగ్గరకు వచ్చేటప్పటికి యిది పరిపూర్ణ మాలిన్యమును పొందుతుంది. కనుక మనము యీ పవిత్రమైన బుద్ధిని పరిశుద్ధమైనదిగా తీర్చిదిద్దుకున్నప్పుడు యీ బుద్ధి యొక్క ప్రభావము డైరెక్టుగా దేహముపైన పడటానికి అవకాశము వుంటుండాది. కనుక బుద్ధి యొక్క పవిత్రతకు, బుద్ధి యొక్క నిర్మలత్వమునకు మానవుడు ప్రయత్నించాలి.

దశోపనిషత్తులందు తైత్తిరీయోపనిషత్తు ప్రధానమైనది. ఈ ఉపనిషత్తు బుద్ధిని ఒక పక్షిగా వర్ణిస్తూ వచ్చింది. దీని యొక్క శిరస్సు శ్రద్ధగా నిర్ణయించింది. కుడివైపున పక్షము అనగా రెక్కకు ఋతము అని పేరు పెట్టింది. ఎడమవైపున వున్న రెక్కపేరు సత్యము అని నిర్ణయించింది. మధ్యనున్న దేహమునకు మహత్తత్త్వము అని పేరు పెట్టింది. దీని తోకకు యోగము అని నామకరణము చేసింది. అనగా బుద్ధి అనే పక్షికి శ్రద్ధ శిరస్సు కుడిపక్క రెక్క

ఋతము. ఎడమ పక్క రెక్క సత్యము, దేహము మహత్తత్వము, తోక యోగము. కనుక బుద్ధి కేవలము ఒక్క భాగముతో కూడినది కాదు. ఋతము, సత్యము, మహత్తత్వము, యోగముతో కూడినది. బుద్ధి సామాన్యమైనది కాదు. ఇది యిన్ని రకములైన అంగములతో కూడి వున్నప్పుడే యిది పూర్ణస్వరూపాన్ని పొందుతుంది. విక్రమాదిత్యుని కాలమునందు ఆయన మహా పండితుల చేత ఒక సమావేశము గావించాడు. ఇక్కడ శ్రద్ధప్రధానమైనదా బుద్ధిప్రధానమైనదా లేక మేధ ప్రధానమైనదా దీనిని మీరు తెల్పి చెప్పాలి అన్నాడు. బుద్ధికి శిరస్సనే శ్రద్ధ లేకపోతే దీనివలన యేమీ ప్రయోజనము లేదు. ఈ పండితుల సమావేశములో అనేకమంది అనేక విధములుగా కూడను చెప్పుతూ వచ్చారు. కట్టకడపటికి మేధాశక్తి గొప్ప అన్నారు. విక్రమాదిత్యుడు పండితుల యొక్క జవాబునకు చింతించి దీనికి సరియైన జవాబు చెప్పలేక పోయినారు గదా అని యోచించాడు.

ఆస్థ స్వాస్థ్యచ్ఛాయ స్యాత్ మేధయా నిరుపయోగః
ఆస్థ శ్రద్ధయాయ నస్యాత్ కిం ప్రయోజనః.

ఓ పండితులారా! ఆస్థ అనగా ఒక ఆసక్తి. స్వాస్థ అనగా ఒక స్థిరత్వము. కనుక ఆసక్తి స్థిరత్వము లేని మేధ నిరుపయోగము అన్నాడు. అనేకమంది చాలా మేధాసక్తులుగా వుండవచ్చును కానీ శ్రద్ధ లేక ఆ మేధాశక్తితో యేమి సాధించగలరు. ఈ మేధాశక్తిపైన ఒక స్థిరత్వమే లేకుండిన యే కార్యమును వారు సాధించలేరు. శ్రద్ధ స్థిరత్వము రెండూ వుండినప్పుడే ఆసక్తి స్థిరపడుతుంది. కనుక మొట్టమొదట ఆసక్తి, స్థిరత్వము యీ రెండు కూడినదే బుద్ధి. కనుక మానవుడు తెలివితేటలపైననే ఆధారపడి తెలివితేటలనే నమ్ముకొని జీవించటము యిది కేవలము వెఱ్ఱితనము. దానిపైన అమితమైన ఆసక్తిని మనము పెంచుకోవాలి. ఆ ఆసక్తిని స్థిరత్వముగా మనము రూపొందించుకోవాలి. అప్పుడే మానవుడు ఎట్టి కార్యమునైననూ సులభముగా సాధించగలడు.

కనుకనే వేదాంతము 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అన్నది. శ్రద్ధ లేకపోతే మనము యెట్టి చిన్న కార్యమునందు కూడను విజయాన్ని కాని, ఆనందాన్ని కాని సాధించలేము. అణుమాత్రము అగ్నియు మన చేతికి చిక్కినప్పుడు శ్రద్ధ వుంటే దానికి [illegible] వేసో లేక వేరే మార్గములతో దానిని గొప్పగా అభివృద్ధి గావించుకోవచ్చు. శ్రద్ధ లేనివానికి తట్టెడు నిప్పులు తెచ్చిపెట్టినా కూడను అశ్రద్ధతో ఆర్పివేసుకోవచ్చు. అతి సూక్ష్మరూపమైన మఱ్ఱిగింజను తెచ్చి శ్రద్ధతో పూడ్చి దానిని అతి శ్రద్ధతో పోషించినప్పుడు ఒక బ్రహ్మాండమైన వృక్షముగా

రూపొందుతుంది. కనుకనే 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అణువునుంచి ఘనము వరకు పెంచటానికి శ్రద్ధ అత్యవసరము. కాని మానవునికి శ్రద్ధ వున్నది దేనిపైన శ్రద్ధ? ఫలములపైన శ్రద్ధ వున్నది. కాని క్రియపైన శ్రద్ధ లేదు. అదే Spirit of Love. ఇది మానవుని యందు సన్నగిలింది. ఈ సైన్సు యొక్క అభివృద్ధి వలన మానవుడు సుఖమునకు మరిగి సోమరత్వమును పెంచుకొని శ్రద్ధను క్రమక్రమేణా సన్నగింప చేసుకుంటున్నాడు. సైన్సు చెడ్డది కాదు. కాని మానవుడు వుపయోగపెట్టటంలో పెడమార్గము పడుతుంది. మనము ప్రతివిషయమందు కూడను పవిత్రమైన ప్రేమను చిన్నాభిన్నము గావించుకుంటున్నాము. కనుకనే ఆధ్యాత్మిక మార్గములో యీ ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి. ఏకత్వముగా నిరూపించాలి. దీనికే యీనాడు ప్రచారము అత్యవసరము. ఒక్కమాటలో ఆధ్యాత్మికమునకు విజ్ఞానానికి వ్యత్యాసము చెప్పాలంటే ఒకే ఒక వాక్యము. Spirit of Love యిదే ఆధ్యాత్మికము Split of Love యిదే విజ్ఞానము. దీనికి యెంత వ్యత్యాసమో చూడండి. ఉన్నది చిన్నదైనా కాని అనంతమైన అర్థములో కూడి వుంటున్నాది. లౌకికమైనట్టి భోగభాగ్యములను, అనుకూల సదుపాయములను యీ వైజ్ఞానము మనకు అందిస్తూ వుంటున్నాది. కాని మానవునకు కావలసిన అంతర్సంబంధమైన ఆనందము. కోరేది ఆనందము. ప్రయత్నించేది ఆనందము నిమిత్తము కాని ఆ ఆనందము వస్తువాహనాదులందున్నదా? ఇంద్రియములందున్నదా? ఆనందమునిచ్చే వస్తువులే అశాశ్వతమైనప్పుడు యీ నిత్యానందము నీకెట్లు లభ్యమవుతుంది. కనుక యిచ్చే పదార్థము అశాశ్వతమే అనుభవించే దేహము అశాశ్వతమే. మనము నివసించే దేశము అశాశ్వతమే. కనుకనే మనము శాశ్వతమైన ఆనందమును అనుభవించాలను కొంటే మానసిక తత్వాన్ని సరియైన రీతిలో వుంచుకోవాలి. ఈనాటి వైజ్ఞానిక పరిజ్ఞానము, నైతిక భౌతిక, ఆధ్యాత్మికమైన అభివృద్ధులు, రాజకీయ పరిణామము, ఆర్థిక పరిణామము, వైజ్ఞానిక పరిణామము, లౌకిక పరిణామము అన్న అభివృద్ధి గాంచినాయి. మానసిక పరిణామము మాత్రము అభివృద్ధి గాంచలేదు. ఈ మానసిక పరిణామము తరువాత ఆధ్యాత్మిక పరిణామము కూడ అత్యవసరము. ఐతే యీ మనస్సు మనకు ఎక్కడనుండి ఆవిర్భవిస్తున్నాది? దీని యొక్క పుట్టిన స్థానము యేమిటి? మనము విచారణ చేస్తూ మనము ఎని ఉక్షరలు తీసుకున్నను అవి మన తలకు అంటుంటలేదు. సులభముగా మనం విచారం చేస్తే నిత్యజీవితములో మనము అనుభవించే ఆహారములోనే అభివృద్ధి అవుతుంది యీ మనసు. మనము తీసుకున్న ఆహారము జీర్ణించుకున్న తరువాత స్థూలరూపములో కొంత మలముగా వెళ్ళిపోతుంది. సూక్ష్మమైన యీ

ఆహారమే రక్త మాంసములుగా తయారౌతున్నది. అతిసూక్ష్మముగా వుండిన ఆహారమే మనస్సుగా రూపొందుతుంది. కనుకనే మనస్సు యొక్క ప్రభావమంతా మనము అనుభవించే ఆహారము పైననే ఆధారపడి వుంటుందాది. దీనికి ప్రాణము అత్యవసరము. ప్రాణమయమైన తరువాతనే మనోమయము, మనోమయమైన తరువాతనే విజ్ఞానమయము, విజ్ఞానమయమైన తరువాతనే ఆనందమయము. ఈ ప్రాణము ఎక్కడనుండి వస్తుందాది. ఎవరు తెచ్చిపెడుతున్నారు. ఏ కనెక్షనులో యిది ప్రాకుతుందాది. ఏమీ లేదు. అదికూడను మన నిత్యజీవితములో అనుభవించే ఆహారమే. మనము త్రాగే నీరు స్థూలరూపములో మూత్రముగా పోతుంది. అతిసూక్ష్మమైన జలకు ప్రాణముగా మారుతున్నాది. అన్నము మనస్సుగాను, నీరు ప్రాణముగాను చేరి మానవునియందు రెండింటి యొక్క సమన్వయ స్వరూపమే విజ్ఞానమయముగా తయారౌతుంది.

ఈ విజ్ఞాన మనగా కేవలము లౌకిక, భౌతిక విజ్ఞానము కాదు. ఇది బాహ్య ప్రపంచమునకు మాత్రమే, స్థూల జగత్తుకు మాత్రమే, జాగ్రదవస్థకు మాత్రమే కాని సూక్ష్మావస్థల యందు, అంతర్భావమైన ఆత్మ తత్త్వమునందు యిది యేమాత్రము కూడను పనికి రాదు. ఐతే బాహ్యన్ని ఆధారము చేసుకొని అంతర్భావమును పోషించుకోటానికి తగిన కృషి చేయాలి. అన్నీ లోపలే వుంటున్నాయిగాని బయట ఎక్కడనుంచి రావటంలేదు. ఆత్మ అహంకారమునకు వున్న వ్యత్యాసము మనము గుర్తించాలి. ఇది ఆత్మనుండియే ఆవిర్భవించింది. ఈ ఆత్మనుండియే తలంపులు బయలుదేరాయి. ఈ తలంపు నుండియే వాక్కు వచ్చింది. ఏతావాతా వాక్కు, తలంపు, అహంకారము యీ మూడు కూడను ఒక ఆత్మ సంబంధమైన కుటుంబమే. కనుక అహంకారమనేది ఆత్మకు పుత్రుడు. ఆత్మకు పుత్రుడు తలంపు. తలంపుకు వాక్కు పుత్రుడు కనుక వాక్కు ఆత్మకు grand son. Great grand son, grand son, son, father వీరంతా ఒక కుటుంబమునకు చెందినట్టి వారు కాదా. అట్లనే యీ అహంకారమనేది కేవలము వస్తూ పోతూ వుంటుంది. రాకపోకలతో కూడినది అహంకారము. రాకపోకలు లేనట్టిది ఆత్మ తత్త్వము. కనుక ఆత్మకు అహంకారమునకు వున్న వ్యత్యాసము గుర్తించాలి. అహంకారమును ego అంటాము. ఇది చాలా తప్పు పదము. అహంకారమంటే కేవలమూ శరీరమునకు సంబంధించిన అహంకారమని భావిస్తున్నారు. కాదు దేహమే నేను అనే భ్రాంతియే అహంకారము. ధనమును బట్టి, కులమును బట్టి, గుణమును బట్టి, విద్యను బట్టి వచ్చేది అహంకారము కాదు.

అది వట్టి భ్రమ. ధనమును చూచి అహంకారపడుతున్నావే అంటున్నారు. ఆ ధనమును చూచి అహంకారము కాదు. అది వట్టి భ్రమనే. నీ విద్యను చూచి నేను గొప్ప విద్యావంతుడనుకదా అనుకుంటున్నావు. అది వట్టి భ్రమగానే వుంటుంది. వీటన్నింటిని అహంకారమని చెప్ప కూడదు. ఒకరికి విద్య వుండి కూడను యీ విధమైన భ్రమ లేకుండా వుండవచ్చు. ధనము వుండి కూడను యిట్టి భ్రమ లేకుండా వుండవచ్చు. కానీ అందరియందు సమముగా యీ అహంకారమనేది వుంటుండాది. అనగా దేహమే నేను అనే భావము వుండటం చేతనే అతనికి అహంకార స్వరూపము ధరించింది. కనుక యీ అహంకారమనేది బుద్ధిని ఆవరించటం చేత అనేక విధములైన చెడు మార్గములను పట్టిస్తూ వుంటుంది దేహమును. కనుక యీ బుద్ధికి శ్రద్ధ అనే దానిని అలవర్చుకోవాలంటే అహంకారాన్ని మొట్టమొదట మనము దూరం చెయ్యాలి.

ఇంక రెండవది యీ పక్షికి వుండేటువంటి కుడిరెక్క ఋతం. ఋతమనగా సర్వసామాన్యముగా వేదమునందు సత్యమని చెబుతూ వచ్చారు. ఋజుమార్గమును చూపేదే ఋతమ్. ఐతే సత్యమునకు ఋతమునకు వ్యత్యాసము వుంటున్నాది. సత్యమే ఋతము ఋతమే సత్యమని చెప్పరాదు. మాటతో చెప్పిన దానిని చేతితో చేయటము చేతితో చేసిన దానిని మాటతో చెప్పటము సత్యము. ఐతే ఋతం అంటే అది కాదు. మనసులో పుట్టిన దానిని మాటతో చెప్పటము మాటతో చెప్పిన దానిని చేతితో చేయటము యిది త్రిగుణాత్మకమైన తత్వముతో కూడినది కనుక ఋతమన్నారు. ఋతమనేది మానసిక సంబంధమైనదని, సత్యమనేది లౌకిక సంబంధమైనదని నిర్ణయించుకోవచ్చును. ఇదే సత్యం సత్యం త్రికాల బాధ్యం అంటుంటారు. ఇది త్రికాల బాగ్యం కావచ్చు త్రిలోక బాధ్యం ఋతం. అనగా మనస్సునందు, వాక్కునందు, క్రియయందు ఏకత్వాన్ని పొందేది ఋతము. కనుకనే ఋతము, సత్యము యీ రెండు రెక్కలు చేరినప్పుడే బుద్ధి సరియైనదిగా వుంటుంది. శ్రద్ధ మాత్రము వుండి ప్రయోజనము లేదు. ఈ శ్రద్ధకు ఋతము, సత్యము కూడను ఏకం కావాలి. కనుక బుద్ధి అంటే సామాన్యమైన బుద్ధిగా మనము భావించరాదు. శ్రద్ధ, ఋతము, సత్యములతో కూడినదే యీ బుద్ధి. ఐతే దానికి తోక వేరే వుంటుండాది. ఈ తోక ఎందుకోసం? రెక్కలను సమన్వయ పరిచేకోసం. balance సరిగా పెట్టేనిమిత్తము యీ తోక అత్యవసరము. ఋత సత్యములను యీ జగత్తులో క్రియారూపములో ప్రసరింపచేయటానికి యీ యోగము అనే తోక అవసరము. లౌకిక జగత్తునందు

aeroplane మనము చూస్తూ వుంటాము. దీనికి రెండు రెక్కలు వుంటుంటాయి. కానీ రెండు రెక్కలతో మాత్రమే యీ aeroplane పరుగెత్తదు. ఈ రెండు రెక్కలకు సమన్వయము పరచే తోక కూడా ఒకటి వుండాలి. ఈ మూడింటి ద్వారానే మధ్యలో నున్న దేహము balance లో వుంటుంది. ఈ plane లోపల కూర్చున్నప్పుడు మీరు చూశారో లేదో ఎక్కే సమయములో ఒక రెక్క క్రిందకొస్తుంది. ఒక రెక్క పైకి పోతుంది. దిగే సమయములో మరొక రెక్క క్రిందకు వస్తుంది. వేరొక రెక్క పైకి పోతుంది. అనగా ఇహసంబంధమైన జగత్తులో మనకు సత్యము ముందుగా వస్తుంది. ఋతము వెనకాల వస్తుంది. ఆధ్యాత్మిక మార్గములో మనము విచారణ సలిపేటప్పుడు ఋతము మొదట వస్తుంది. సత్యము దాని వెంబడుతుంది. కనుక యిదంతా కూడను ఒక balance పైన ఆధారపడి వుంటుంటుంది. అన్ని రకములైన balance లన్నీ సరిగా వున్నప్పుడే యీ బుద్ధి బుద్ధిగా రూపొందుతుంది. కేవలము ఋతము, సత్యము, యోగము లేకుండా పోతే యిది బుద్ధియే కాదు.

ఈ యోగమంటే ఏమిటి? ఇది క్రియా యోగమా లేక హఠయోగమా లేక రాజయోగమా ఏ యోగము కాదిది. కేవలము ఆసనాలు వేయటమే యోగము కాదు. ఇది ఒక physical training. ఒక విధమైన కసరత్తు. ఇవన్నీ కేవలము దేహాన్ని పోషించే నిమిత్తము యేర్పడినవే. నిజమైన యోగమంటే 'యోగః చిత్త వృత్తి నిరోధకః' మన యింద్రియములను అరికట్టే యోగమే నిజమైన యోగము, ఈ యోగమనేది లేక. ఈ యోగముతో కూడినప్పుడే బుద్ధి సరియైన మార్గములో నడుస్తుంది. కేవలము మేధాశక్తితో తెలివితేటలలో కూడిన వానిని వీడు బుద్ధిమంతుడు అంటారు. ఇది బుద్ధిమంతుడు కాదిది. తెలివిమంతుడు కావచ్చును. అక్కడ బుద్ధిని వుపయోగించరాదు. బుద్ధిని వుపయోగించాలంటే ఎక్కడ వుపయోగించాలి. అంతరసంబంధమైన శ్రద్ధ ఋతము సత్యము, యోగము, మహత్తత్వము యీ ఐదింటి యొక్క చేరిక సమయమునందే దీనికి బుద్ధి అని వుపయోగించవచ్చు. ఈ యోగము వుండినప్పుడు కూడా మధ్యలో దేహము వుంటుండాలి. అదే మహత్తత్వము. గొప్ప తత్వము. మహత్ అనగా గొప్ప అని అర్థము. తత్వము అనగా రెండింటిని గుర్తించినది అని. అందుకనే మహా మంత్రమునందు 'తత్వమసి' అన్నారు. అదే నేను అని. ఈ సర్వశక్తితో కూడిన దివ్యత్వమే నేను అనే తత్వమే యీ మహత్తత్వము. నేనే సచ్చిదానందము యిదే మహత్తత్వము. స్వస్వరూప సందర్శనా భాగ్యమే యీ మహత్తత్వము. తానెవరో తాను గుర్తించుకోటమే సరియైన తత్వము.

కనుక బుద్ధి లోనెవరో తాను గుర్తించుకో గలుగుతే అదే నిజమైన బుద్ధి. కేవలము తెలివి తేటలతో ప్రపంచమునంతా తెలిసికొనిన వాడు బుద్ధిమంతుడు కాడు. తనను తాను తెలుసుకున్నవాడే బుద్ధిమంతుడు. కనుక యిక్కడ బుద్ధి అనే దానిని సామాన్య పేరుతో మనము అనుభవించరాదు. ఇది కేవలము ఆత్మ ప్రతిబింబమనే చెప్పవచ్చును. ఇది ఆత్మ యొక్క reaction అనే చెప్పవచ్చును. ఇది ఆత్మ యొక్క reflection అనే చెప్పవచ్చును. ఇది ఆత్మ యొక్క rebound అనే చెప్పవచ్చు. కనుక rebound reflection, reaction యొక్క తత్వమే బుద్ధి యొక్క ప్రమాణము.

కనుక విద్యార్థులు యీవిధమైన బుద్ధి యొక్క రహస్యాన్ని చక్కగా తెలుసుకున్నప్పుడే నేను బుద్ధిమంతుడా లేక భ్రమతో కూడిన వాడా అని తనకు తానే నిర్ణయము చేసుకోవచ్చు. First rank వచ్చినంత మాత్రమున, కేవలము 'O' grade వచ్చినంత మాత్రమున నేను చాలా తెలివి తేటలు గలవాడనని భావించవచ్చు. తెలివి తేటలు వుండవచ్చు. అది మేధా శక్తికి సంబంధించినది. మే, మే అదే మేధాశక్తి. మేధా దానిలో పుట్టినటువంటి శక్తి. మేధాశక్తి యే మాయాశక్తి. రామచంద్రుడు పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేసి తిరిగి అయోధ్యను చేరిన తరువాత కైక తన దోషమును తాను గుర్తించి వంటరిగా వున్న సమయమునందు రాముని దగ్గరకు వెళ్ళి, నాయనా! నావలననే నీకిన్ని కష్టములు కలిగినవి. నీవు సాక్షాత్తు భగవంతుడవని తెలిసి కూడను నా అభిమానము చేత నా విషయవాసనల చేత, నా మమకారము చేత నిన్ను యిటువంటి కష్టములకు గురి చేసితిని నాయనా! ఈ పరిహారార్థమై నీవు యేదైనా వుపదేశమును చేసి నా పాపమును క్షీణింపచేయుమని కోరింది. రాముడు direct గా చెప్పకుండా indirect గా మార్గము చూపించాడు. ఇది అనాదికాలమునుండి అవతారము యొక్క రహస్యమే యిది. ఏదీ direct గా చెప్పటంలేదు. కొన్ని మాత్రమే direct గా చెప్పవచ్చును కాని కాని indirect గా చెప్తూ వుంటారు. కారణమే మనగా మానవత్వమునందే దివ్యత్వము వున్నది కనుక ఆ దివ్యత్వమును మేలుకొలిపి, ఆ దివ్యత్వము ద్వారానే తాను గుర్తించ ప్రయత్నించాలి. అన్ని కూడను direct గా చెప్తూ పోతుంటే తన యొక్క దివ్యత్వాన్ని తాను యే మాత్రము అర్థము చేసుకోలేడు. తన దివ్యత్వమును అర్థము చేసుకొనే స్వతంత్రమును అతనికి అందించటానికి దైవము తాను indirect గా చెప్తూ వుంటాడు. 'అమ్మా! నీకు ఉపదేశము చేస్తాను. సరయూనదీ తీరమునకు వెళ్ళి, స్నానము చేసి అక్కడ చుట్టూ యేమైనా వుంటు

న్నాయో చూచి అవి యేమి చేస్తున్నాయో చూసుకొని రమ్మనమన్నాడు. ఆమె యీనాడు నాప్పు ఉపదేశమును అందుకోబోతున్నాను తనకు మూరుడు రామచంద్రుని వద్దనుండి అని సరయూనదీ తీరమునకు పోయింది తన స్నేహితులతో స్నానం చేసింది. చుట్టూ చూసింది. ఏమున్నాయో అని. అక్కడ అంతా గొర్రెలు వుంటున్నాయి. చూచింది. ఎక్కడ చూచినా మేమే అని అరుస్తూ వున్నాయి ఆ గొర్రెలు. వచ్చింది పాపం. 'అమ్మా! మీరు స్నానం చేశారా?' చేసాను. ఐతే సరయూనదీ తీరమున యేమి జీవిస్తున్నాయి. ఏ ఏ మృగములున్నాయి. ఏ మనుష్యులున్నారు చెప్పుమన్నాడు. నాయనా! గొర్రెలు, మేకలు పచ్చగడ్డిని మేస్తున్నాయి అన్నది. అవి ఏవిధముగా శబ్దము చేస్తున్నాయి అన్నాడు. వాని స్వభావమే కదా మేమే అని అరుస్తున్నాయి అన్నది. మే అంటే ఏమిటి అన్నాడు. నేనెవరు అనేది. గొర్రెలు గుర్తిస్తున్నాయి నేనెవరు నేనెవరు అని. నీవు మానవుడవై వుండి నేనెవరు అనేది గుర్తించకుంటే నీవును గొర్రెతో సమానము. అన్నాడు. కనుక యీనాడు నేనెవరు అని ప్రశ్న వేసుకోకుండా నేనెవరు ఇతనెవరు అని ప్రశ్న వేసుకుంటే మరంతా గొర్రెలతో సమానమే. మొట్టమొదట నేనెవరు అని ప్రశ్న వేసుకో. పుట్టినప్పుడు యే రీతిలో పుట్టావో గిట్టినప్పుడు కూడా ఆ యొక్క రీతిలోనే గిట్టరాదు. పుట్టినప్పుడు నీవు కోహం కోహం అని ఏడ్చినావు. కోహం అనగా నేనెవరు అని అర్థము. చచ్చేదాకా నేనెవరు నేనెవరు అనే చస్తే యిక పుట్టి ప్రయోజనమేమిటి. పుట్టినపుడు కోహం అని పుట్టావు. చచ్చేటప్పుడు 'సోహం' అని చావాలి. ఇదే సార్థకము. కనుక మనయందున్న అహంకార తత్వాన్ని మనము నిర్మూలము గావించుకోవాలంటే ఒకే మార్గాన్ని మనము అనుసరించాలి. ఇది ఒక భగవత్ మార్గములో తప్ప అన్యమైన యే మార్గములో యిది ఫలించదు.

అహంకారము కలిగినప్పుడు నీవు ఒక ప్రదేశములో కూర్చో. నీ శ్వాసను నీవు పరీక్షగావించు. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు యేమి పలుకుతున్నాయో observe చేయి. 'సో..హం' ఈ శ్వాసను నీవు చక్కగా అనుసరించు. సోహం అనగా సః, అహం యీ రెండు పదములు చేరి సోహం అయింది. సః నీవు అహం నేను. సః బ్రహ్మ అహం నేను. అహం బ్రహ్మాస్మి అనే భావమును మనలో ఆవిర్భవించుకొని యీ అహం బ్రహ్మాస్మి అనే భావాన్ని అభివృద్ధి గావించుకుంటూ వస్తే యీ అహం యే మాత్రము బాధించదు. దీనినే వేదాంత పరిభాషలో హంస గాయత్రి అని చెపుతూ వచ్చారు.

విద్యార్థులారా! మనయందు అంతర్వాణి అదే conscience క్షణక్షణమునకు

కూడా బోధిస్తూ వస్తుందాది సోహం తత్త్వము చేత. దినమునకు 24 గంటలు. ఇరవైనాలుగు గంటలలోపల కూడను యీ సోహం సోహం అనేది 21,600 సార్లు చెప్తుందాది. 21,600 సార్లు బ్రహ్మనేనే, నేనే బ్రహ్మ అని అంతర్యామి నీకు ఉపదేశము చేస్తూ వుంటే యీ వుపదేశము ఒకప్రక్క కట్టిపెట్టి నేనే బ్రహ్మ అనేది మరచిపోయి నేను రామయ్య, నేను శివయ్య, నేను జోగయ్య అని యీ విధముగా చెప్పుకుంటూ పోతుంటే యిది యేమైనా సరియైన మార్గమా. నీవు రామయ్య కృష్ణయ్య అనుకొని ఎంతకాలము సాధన చేసినా కూడను ప్రయోజనము లేదు. నీవు రామయ్య కృష్ణయ్య లాగానే వుంటావు. ఈ రామయ్య కృష్ణయ్య దేహమునకు పెట్టిన పేర్లుగాని నీకు పెట్టిన పేర్లు కాదు. ఇది దేహానికి పెట్టిన పేరు. సోహం అనేది దేహానికి పెట్టిన పేరుకాదు. సోహం అనేది పుట్టిన పేరు. పుట్టినపేరు శాశ్వతముగాని పెట్టినపేరు శాశ్వతమా? పెట్టినపేరు కృత్రిమమైనది. artificial. పుట్టినది real. అదే నీ సత్యము. ఆ సత్యమునే ఋతముగా భావించుకోవాలి. ఈ సత్య ఋతములను రెండింటిని ఏకత్వము గావించుకొని, దివ్యత్వమైన సచ్చిదానందమును పొందాలి. కనుక బుద్ధి అనేది కేవలము లౌకికరీత్యా వుచ్ఛరించేదిగానీ, అనుభవించేదిగాని, వుపయోగించేటువంటిదిగానీ కాదు. బుద్ధి యొక్క రహస్యాన్ని గుర్తించుకొని యీ రథసారథి యొక్క విషయాన్ని తద్వారా పూర్తిగా తెలుసుకొన్నప్పుడే మన జీవిత రథాన్ని అతనికి అర్పితము చేయటానికి అవకాశము వుంటుంది. కృష్ణుడు పార్థసారథి. పార్థుడు అంటే ఎవరు? పార్థుడంటే కేవలము అర్జునుడే కాదు. పృథ్వీ పుత్రుడైనవాడే పార్థుడు. కనుక మీరందరు పృథ్వీ పుత్రులే. మీ కందరికి పార్థసారథి. కనుక మీరందరు భగవంతుని సారథిగా స్వీకరించాలి. ఆత్మ భగవంతుని యొక్క ప్రతిబింబము కనుక బుద్ధిని సహజముగా పెట్టుకొని యీ భగవంతుని పెన్నిధిని సన్నిధిని చేరటానికి ప్రయత్నించండి. అన్నింటికి నీ ప్రేమ అత్యవసరము. ప్రేమ లేకుండా యేకార్యము కూడను మనము చేయటానికి వీలుండదు. కేవలము తినటము త్రాగటము కూడను ప్రేమ వుండినప్పుడే తినటానికి త్రాగటానికి పూనుకుంటాము. కనుక ఆ ప్రేమస్వరూపుడే భగవంతుడు. సత్యభాస్కరుడే భగవంతుడు. సద్గుణములకు నిలయమైనవాడే భగవంతుడు. కనుక ప్రేమచేత యదార్థ స్వరూపాన్ని గుర్తించటానికి బుద్ధిని ఆశ్రయించి తద్వారా మీయొక్క మానసిక తత్త్వాన్ని పవిత్రమైనదిగా, పరిశుద్ధమైనదిగా దివ్యమైన, భవ్యమైన, నవ్యమైనదిగా తీర్చిదిద్దుకుంటారని నేను ఆశిస్తున్నాను.